చిరుతల మృతితో అప్రమత్తం

సోమల, న్యూస్‌టుడే: జిల్లాలో రెండు పులులు మృత్యువాతపడిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తం అయ్యారు. యాదమరి మండలంలో వేటగాళ్లు పన్నిన ఉచ్చులో చిక్కి మగ చిరుత (4-5 ఏళ్లు) బలైంది. తాళ్లమడుగు సమీపంలోని బోడబండ్ల బీట్ పరిధిలో చిరుత కళేబరాన్ని గుర్తించారు. సోమల మండలంలోని ఆవులపల్లె అటవీ పరిధి గట్టువారి పల్లె సమీపంలోని చెరువుకోన అటవీ ప్రాంతంలోని లోయలో మరో చిరుత కళేబరం వెలుగు చూసింది. డీఎఫ్‌వో భరణి, ఎఫ్ఆర్వో శ్రీరాములు ఘటనా స్థలం పరిశీలించారు. పశుసంవర్ధక ఏడీ శ్రీనివాసులునాయుడు, పశువైద్యాధికారి చందనప్రియ, తిరుపతి జూపార్క్ అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో కళేబరానికి పరీక్షలు నిర్వహించారు. చిరుత వేటగాళ్ల ఉచ్చులో పడిందా విద్యుత్తు తీగలు తగలి మృత్యువాత పడిందా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. లోయనుదాటే క్రమంలో జారిపడి మృతిచెందినట్లు భావిస్తున్నామని, శవ



ఘటనా స్థలం పరిశీలిస్తున్న అధికారులు

పరీక్ష నివేదిక ఆధారంగా కేసు పరిశీలిస్తామని అధికారులు తెలిపారు. చిరుతకు కాళ్ల గోర్లు అలాగే ఉన్నాయని మృతిచెంది మూడు రోజులకు పైగా ఉంటుందన్నారు.

సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: టోకెన్లు లేకుండా సోమవారం సాయంత్రానికి తిరుమల వచ్చిన భక్తులకు దాదాపు 6 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. ఆదివారం శ్రీవారిని 73,926 మంది దర్శించుకున్నారు. రూ.3.87 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

సక్షం.. సమగ్ర లక్ష్యం

నూతన పథకానికి 814 అంగన్‌వాడీ కేంద్రాల ఎంపిక

ఉద్దేశమిలా..

ఆరేళ్లలోపు పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల వికాసమే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సమస్యల కారణంగా ఫలితాలు రావడం లేదు. వీటిని అధిగమించి మెరుగైన ఫలితాలు సాధించడమే స్త్రీ, శిశు సంక్షేమ శాఖ.. సక్షం (సిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టైనబుల్ హెల్త్ మేనేజ్‌మెంట్) లక్ష్యం.

న్యూస్‌టుడే, పుంగనూరు

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడం వరకే అంగన్‌వాడీ కేంద్రాలను పరిమితం చేయకుండా అదనపు హంగులు కల్పించడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాయి. సక్షం అనే వినూత్న కార్యక్రమం అమలుకు శ్రీకారం చుడుతున్నాయి. ఇందుకు జిల్లాలోని 814 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేశారు.

పెరటితోటల పెంపకం

ఎంపికైన కేంద్రం ఆవరణలో పోషణ వాటిక(పెరటి తోట)ఏర్పాటు చేసి కూరగాయలు, ఆకుకూరలు పండిస్తారు. ఫలసాయం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారంగా పంపిణీ చేస్తారు.

ఏర్పాట్లు ఇలా..

జిల్లాలో 2,420 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 814 కేంద్రాలను ఎంపిక చేశారు. వాటిలో తల్లీబిడ్డ ఆరోగ్య పరిరక్షణ, బాలల శారీరక, మానసిక ఎదుగుదలకు వసతులు, కేంద్రాల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయనున్నారు. కార్టూన్లు, బొమ్మలు, ఆటలు, పాటలు, చిట్టి కథలు తదితర వాటిని ఎల్ఈడీ తెరలపై చూపుతూ ఆసక్తిగా బోధించనున్నారు. శుద్ధజలం, మరుగుదొడ్లు, బల్లలు, కుర్చీలు, ఫర్నిచర్ ఏర్పాటు చేస్తారు. బోధనకు, దృశ్య శ్రవణ విద్యకు అవసరమైన పరికరాలు సమకూర్చుతారు.



చిన్నారులకు బోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ

సక్షం పథకం కింద జిల్లాలో 814 కేంద్రాలు ఎంపిక చేశాం. వసతుల కల్పనతో పాటు శుద్ధజలం, పౌష్టికాహారం అందిస్తారు. ఎల్ఈడీ టీవీల ద్వారా బోధన జరుగుతోంది. సిబ్బంది విధుల నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుంది.

– హేమావతి, పీడీ, ఐసీడీఎస్, చిత్తూరు

జిల్లా వివరాలు

ఐసీడీఎస్ ప్రాజెక్టులు	12
కేంద్రాలు	2,420
గర్భిణులు	11,222
బాలింతలు	9,253
ఆరేళ్లలోపు పిల్లలు	97,087

నిధుల కేటాయింపు

జిల్లాలో 814 అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ వాటికలకు రూ.81.40 లక్షలు, ఇతర సదుపాయాల కల్పనకు రూ.2,91,41,200 కేటాయించారు.

పేదల గూటికి.. కూటమి కానుక

తెదేపా నేతలతో సమీక్షలో సీఎం చంద్రబాబు సానుకూలత

- 2014-19 గృహనిర్మాణ బకాయిలకు త్వరలో మోక్షం
- రెండు జిల్లాల్లో రూ.86.25 కోట్ల బిల్లులు
- సర్వే పూర్తిచేసి నివేదించనున్న అధికారులు

ఈనాడు, చిత్తూరు: పేదల పక్షపాతినంటూ ఐదేళ్లూ ఊరూవాడా ప్రగల్భాలు పలికిన గత ముఖ్యమంత్రి జగన్.. బడుగు, బలహీన వర్గాలకు వెన్నుపోటు పొడిచారు. వారికి గత తెదేపా ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు నిధులు ఇవ్వకుండా మొండిచేయి చూపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే వారి గోడు ఆలకించింది. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు తెదేపా నాయకులతో అమరావతిలో నిర్వహించిన సమావేశంలోనూ హామీ ఇచ్చారు. సిబ్బంది క్షేత్రస్థాయి సర్వే తుదిదశకు చేరిన నేపథ్యంలో త్వరలో బిల్లులు జమయ్యే అవకాశం ఉంది.

రెండుసార్లు తనిఖీలు చేసినా

2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాన్ని అటకెక్కించింది. తొలినాళ్లలో సర్వే చేసి నిజమైన లబ్ధిదారులకే సాయం చేస్తామని ప్రకటించింది. 2022 డిసెంబరు, 2023 జూన్‌లో రెండుసార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అర్హులకే ఇళ్లు ఇచ్చారని తేలడంతో లబ్ధిదారులకు రూపాయి జమచేసి తర్వాత ఆ ఊసే మరిచారు.

ఒక్కో ఇంటికి రూ.2 లక్షలు..

2014-19 మధ్య అప్పటి సీఎం చంద్రబాబు ఎన్టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ పథకం ప్రవేశపెట్టారు. కేంద్రం వాటాతో కలిపి ఇంటి నిర్మాణానికి రూ.2 లక్షలు.. ఎస్సీ, ఎస్టీలకు రూ.2.50 లక్షలు చొప్పున ఇచ్చారు. ఇల్లు కట్టుకుంటే వెంటనే బిల్లులు పడతాయని అధికారులు చెప్పడంతో నిర్మాణాలకు పేదలు ముందుకు కదిలారు. జగన్ ప్రభుత్వం రాకతో కక్షపూరితంగా వ్యవహరించింది.



వి.కోట: పాపేపల్లిలో ఇంటివద్ద గృహ నిర్మాణశాఖ అధికారులు

చిత్తూరులో 29,093

తిరుపతి జిల్లాలో 23,484. చిత్తూరులో 29,093 గృహాలకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. చిత్తూరు జిల్లాలోని 29,093 గృహాలకు రూ.222.10 కోట్లకుగాను 2019 నాటికి రూ.174.91 కోట్లు చెల్లించారు. తిరుపతి జిల్లాలో రూ.238.37 కోట్లలో రూ.199.31 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు. రెండు జిల్లాల్లో కలిపి ఇప్పటికీ రూ.86.25 కోట్ల బకాయిలున్నాయి.

సర్వే తుది దశకు

ఇళ్లు గతంలో ఏదశలో ఉన్నాయి? ఇప్పుడు ఏదశలో ఉన్నాయి? బ్యాంకు ఖాతా పాతదేనా? ఏమైనా మార్చారా? అని తెలుసుకునేందుకు గృహ నిర్మాణ శాఖ అధికారులు నెలరోజుల క్రితం సర్వే ప్రారంభించారు. జిల్లాలో సోమవారంతో ఇది పూర్తికాగా తిరుపతిలో ఒకట్రెండు రోజుల్లో ముగియనుంది. ఆ వెంటనే ఈ వివరాలు ప్రభుత్వానికి నివేదించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో సుముఖంగా ఉన్నందున త్వరలోనే బకాయిలు విడుదల కానున్నాయి.

■ బైరెడ్డిపల్లె మండలం శెట్టిపల్లెకు చెందిన ఉషకు 2017లో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరైంది. మూడు విడతల్లో ఆమెకు రూ.1.07 లక్షలు మంజూరైంది. రూ.43 వేల బిల్లు రావాల్సిన తరుణంలో ఎన్నికలు వచ్చాయి. వైకాపా అధికారంలోకి వచ్చాక ఐదేళ్లూ పట్టించుకోలేదు. ఇటీవల ఆమె వివరాలను అధికారులు నమోదు చేయడంతో త్వరలో బిల్లులు వస్తాయన్న ఆనందం ఆమెలో వ్యక్తమవుతోంది.

పీఎంఏవై-2.0లో 2,149 చేర్చాలని

మరోవైపు గతంలో మంజూరై పునాది, అంతకన్నా ఎక్కువ స్థాయిలో నిర్మాణం జరిగిన ఇళ్లను ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) 2.0లో చేర్చాలని భావిస్తున్నారు. చిత్తూరులో అత్యధికంగా 1,563, తిరుపతిలో 586 మొత్తంగా 2,149 గృహాలకు ఆమోదం లభించనుంది. దీంతో లబ్ధిదారులకు ప్రభుత్వ సాయమూ పెరుగుతుంది.

2014-19లో చేపట్టిన నిర్మాణాలు, సర్వే, వ్యయ వివరాలు

పరిశీలించాల్సినవి	29,093
పరిశీలించినవి	29,093

(రూ.కోట్లలో)..

వ్యయం	222.10
చెల్లింపులు	174.91
బకాయిలు	47.19

బిల్లు రీడింగ్ కాంట్రాక్ట్ అప్పగింత

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ పరిధిలోని విద్యుత్ బిల్లుల రీడింగ్ కాంట్రాక్టును విజయవాడ చెందిన ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగిస్తూ సోమవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ సంస్థకు రెండేళ్ల కాంట్రాక్టు పద్ధతిపై విద్యుత్ బిల్లులు రీడింగ్ చేసే బాధ్యతను అప్పగించారు. వచ్చే నెల ఒకటి నుంచి ఆ సంస్థ రీడింగ్ పనులు ప్రారంభించనుంది.

డీసీసీబీ శాఖల్లో అక్రమాలపై విచారణ

ఈనాడు కథనానికి స్పందన

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో డీసీసీబీ పాలకవర్గ అక్రమాలపై విచారణ ప్రారంభమైంది. డీసీసీబీ పరిధిలో జరిగిన అక్రమాలపై సెప్టెంబర్ 30న 'సొంత జాగీరులా డీసీసీబీ', ఈ నెల ఎనిమిదో తేదీన 'సహకారం ప్రజాప్రతినిధి స్వాహాకార్యం' శీర్షికలతో 'ఈనాడు'లో ప్రచురితమైన కథనాలపై సహకార సంఘాల రిజిస్ట్రార్ అహ్మద్ బాబు స్పందించారు. బ్యాంకు పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా రుణాల మంజూరు, భవన నిర్మాణాల పేరుతో నిధుల్ని స్వాహా చేయడం తదితర అంశాలపై విచారణకు ఆదేశించారు. ఇందుకు జిల్లా సహకార అధికారి నాగవర్ధనను నియమించారు. ఆమె సోమవారం దస్త్రాలు పరిశీలించి ఆయా విభాగాల అధికారుల్ని విచారించారు. జిల్లాలోని శాఖల్లోనూ మరో బృందం విచారణ ప్రారంభించింది. రెండ్రోజుల పాటు ఈ విచారణ కొనసాగనున్నట్లు సమాచారం.

దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(మహిళా వర్సిటీ): శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో మాస్టర్ ఆఫ్ సంగీతం, కామర్స్, డిప్లమో ఇన్ సంకీర్తన, వర్ణం, అన్నమయ్య అంతరంగం కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్స్ సంచాలకులు సువర్ణలతాదేవి తెలిపారు. అర్హత ఉన్న మహిళా అభ్యర్థులు ఈ నెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని, వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలకు చరవాణి సంఖ్య 81217 87415లో సంప్రదించాలని సూచించారు.

సమగ్ర భూసర్వే తప్పుల దిద్దుబాటు

- గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు
- నేటి నుంచి నవంబర్ 15 వరకూ..
- బాధితుల నుంచి అర్జీల స్వీకరణ



వృథాగా పడి ఉన్న సర్వే రాళ్లు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన సమగ్ర భూముల రీసర్వేతో రైతుల సమస్యలు పరిష్కారం కాకపోగా కొత్తవి పుట్టుకొచ్చాయి. రైతులకు ఇచ్చిన భూ హక్కు పత్రాల్లో కొందరికి భూ విస్తీర్ణం తగ్గిపోయాయి, సరిహద్దులు మారిపోయాయి. దీనిపై రైతులు విన్నవించినా పరిష్కరించలేకపోయారు. మొత్తంగా ఈ కార్యక్రమం గందరగోళంగా మారిపోయింది. సమస్య గుర్తించిన కూటమి ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నానికి చర్యలు చేపట్టింది.

● **329 రెవెన్యూ గ్రామాల్లో ..:** జిల్లాలోని 28 మండలాల్లోని 329 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వేను చేపట్టారు. సర్వే పూర్తయిన వాటికి ఎల్‌పీఎం నంబర్లను, ఖాతాల్ని కేటాయించారు. ఎల్‌పీఎం ఆధారంగా రిజిస్ట్రేషన్లను చేపట్టారు.

ఎల్‌పీఎంలు	3,25,897
భూ విస్తీర్ణం	3,02,555
ఖాతాలు	1,57,896

మొత్తం ఖాతాలు, భూ విస్తీర్ణం (ఎకరాల్లో)

● **నవంబరు 15 వరకు..:** రెవెన్యూ గ్రామసభలు ఈ నెల 22న ప్రారంభమై నవంబరు 15 వరకూ కొనసాగనున్నట్లు జేసీ విద్యాధరి తెలిపారు. గ్రామసభలకు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్, వీఆర్‌వో, గ్రామ సర్వేయర్‌లు రికార్డులతో హాజరుకావాలని పేర్కొన్నారు. సభల తేదీలపై ముందుగా టాంటాం వేయాలని ఆదేశించారు.

శిక్షణ పక్కాగా.. కలల కొలువు వరించేలా..!

డీఎస్సీ అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతీ, యువకుల కలల సాకారం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఎన్నికల హామీ అమలులో భాగంగా ఇప్పటికే టెట్ చేపట్టగా.. త్వరలో మెగా డీఎస్సీ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది.



■ వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు ఊరించి ఉసూరుమనిపించిన నేపథ్యంలో సన్నద్ధతలో ఏ లోటూ లేకుండా, తాము పోటీ పడలేకపోయామే.. అనే పరిస్థితి యువతలో రాకుండా చర్యలు తీసుకుంటోంది. అన్ని విభాగాల అభ్యర్థుల శిక్షణకు తోడ్పాటునందిస్తూనే ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఉచిత బోధనతో పాటు వసతి, భోజన సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయించింది.

■ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి 5,050 మంది అభ్యర్థులకు ఆయా ప్రైవేటు సంస్థల సహకారంతో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. పరీక్షల్లో ఉత్తమ ప్రతిభకనబరిచే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం సువర్ణావకాశాన్ని ప్రకటించింది.

టెట్ మార్కులో కలిపి..

నవంబర్ 2న వెలువడే టెట్ ఫలితాలు, స్క్రీనింగ్ పరీక్షలో వచ్చే మార్కులను పరిశీలించి మహిళా అభ్యర్థులను ఎంపిక చేసి వారికి బోధన, వసతి, భోజన సదుపాయం కల్పించనున్నారు.

అంబేడ్కర్ అధ్యయన కేంద్రాల్లో..

ఇందుకు విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలోని డా.బీఆర్ అంబేడ్కర్ అధ్యయన కేంద్రాలు వేదిక కానున్నాయి. ఒక్కో కేంద్రంలో 150 మంది అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. నవంబరు 5 నుంచి తరగతులు ప్రారంభించి డీఎస్సీ పరీక్ష తేదీలకు అనుగుణంగా శిక్షణ ఇవ్వనున్నారు.

25వ తేదీలోగా నమోదు చేసుకోవాలి

సాధారణంగా బ్యాంకింగ్, గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలోని స్టడీ సర్కిళ్లలో శిక్షణ ఇస్తుంటాం. ఈసారి మెగా డీఎస్సీ అభ్యర్థులకూ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. టెట్ అర్హత సాధించిన వారు, కుటుంబ వార్షికాదాయం రూ.2.5 లక్షలు లోగా ఉన్నవారు అర్హులు. portal:https:///tender.apeproure-ment.gov.in వెబ్‌సైట్‌లో, అభ్యర్థులు www.jnan-abhumi.ap.gov.in లో ఈ నెల 25 లోగా నమోదు చేసుకోవాలి.

– రాజ్యలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి

సీఎం చెబితే మాకేంటి?

పూతలపట్టులో మద్యం దుకాణదారులకు నేతల హెచ్చరికలు

ఈనాడు, చిత్తూరు: 'ఇసుక, మద్యం వ్యవహారాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నేతలెవరూ జోక్యం చేసుకోవద్దు. మీరు తప్పుచేస్తే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. అరాచకాలు, దౌర్జన్యాలకు పాల్పడినందునే వైకాపా 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిందని గుర్తుంచుకోండి' అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు తరచూ తెదేపా నేతలకు చేస్తున్న హితవు ఇది. ఈనెల 18న మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలోనూ ఆయన గట్టిగా చెప్పారు. అయినా పూతలపట్టు నియోజకవర్గంలోని స్థానిక నేతలు కొందరు తమ వైఖరి మార్చుకోలేదు. దుకాణాలు పొందిన వ్యక్తులను బెదిరిస్తూ.. తెలుగుదేశానికి చెడ్డపేరు తెచ్చేందుకు యత్నిస్తున్నారు. బంగారుపాళ్యం మండలంలో నివాసం ఉంటోన్న వ్యక్తికి ఈనెల 14న నిర్వహించిన లాటరీలో పూతలపట్టు మండలంలో వచ్చింది. ఆరోజు నుంచి స్థానిక నేతలు బెదిరిస్తున్నారు. పి.కొత్తకోటలో అద్దెకు గది తీసుకోవడానికి వెళ్లగా అక్కడా అడ్డగించారు. తవణంపల్లె మండలంలో ఒకరికి ఇటువంటి అనుభవమే ఎదురైంది. యాదమరిలో 30 శాతం ఇస్తేనే వ్యాపారం జరుగుతుందని ఒకరిని హెచ్చరించగా మరో వ్యక్తినీ ఇబ్బందులు పెడుతున్నారు.

నేడు ఎన్టీఆర్ ట్రస్టు ఉచిత డీఎస్సీ శిక్షణ ప్రారంభం

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సాయంత్రం ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో డీఎస్సీ ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు ఎన్టీఆర్ ట్రస్టు కోఆర్డినేటర్ రాజీవ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారన్నారు.

పరిహారం రెండింతలు

వన్యప్రాణుల దాడిలో ఆస్తి, ప్రాణ నష్టాలకు పెంపు

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: వన్యప్రాణుల దాడిలో ప్రాణ, పంట నష్టాలకు ఇచ్చే పరిహారాన్ని పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది అటవీ శాఖ జిల్లా అధికారులు పరిహారం పెంచాలని ప్రభుత్వానికి నివేదించారు. పరిశీలించిన కూటమి ప్రభుత్వం వన్యప్రాణుల దాడిలో మరణిస్తే గతంలో ఇస్తున్న రూ.5 లక్షలను రూ.10 లక్షలకు పెంచింది. గాయపడిన వారికి ఇస్తున్న రూ.75 వేలను రూ.2 లక్షలకు.. పాడి, చెరకు పంటకు ఎకరానికి ఇస్తున్న రూ.6 వేలను రూ.12 వేలకు పెంచారు. మామిడి, కొబ్బరి చెట్లకు రూ.1500 నుంచి రూ.2 వేలకు పెంచారు.

1,040 హెక్టార్లకు సూక్ష్మసేద్యం మంజూరు

చిత్తూరు(వ్యవసాయం) : బిందు, తుంపర్ల సేద్యం పథకం రాయితీ 1,040 హెక్టార్లకు మంజూరు చేస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆమోదముద్ర వేశారని సూక్ష్మనీటిసాగు పథకం పీడీ బాలసుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. రాయితీలకు జిల్లాలో 24 వేల హెక్టార్లకు గాను 25 వేల మంది రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. అర్హులైన రైతుల క్షేత్ర స్థాయి పరిశీలన, వ్యయ అంచనాల ప్రతిపాదనలు సిద్ధం చేసి రైతుల చరవాణులకు పంపుతున్నామన్నారు. రైతు వాటా నగదు చెల్లించిన రైతులకు లక్ష్యం ప్రకారం వర్తింపజేస్తామన్నారు.

రైతేరాజు 6లో

రైతేరాజు

వేలల్లో పెట్టుబడి.. లక్షల్లో ఆదాయం



సత్యవేడు, న్యూస్‌టుడే: రైతులు పూల సాగుతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. వీటిల్లో బంతి పూలు ముఖ్యమైనవి. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. పండుగల సీజన్ కావడంతో రైతులు ఆదాయాలను పొందుతున్నారు. తండ్రి వ్యవసాయదారుడు కావడంతో చిన్నతనం నుంచి వ్యవసాయంపై మక్కువ పెంచుకున్నారు వెంకటరాజుల కండ్రిగ గ్రామానికి చెందిన రుషి. అతి తక్కువ సమయంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే వాణిజ్య పంటలపై మక్కువ పెంచుకుని బంతిపూలను సాగు చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం హోసూరు తెప్పించిన నారు మంచి దిగుబడిని ఇవ్వడంతో అధిక దిగుబడులు పొందుతున్నారు.

చీడపీడలు ఆశించకుండా జాగ్రత్తలు..

ఎకరంలో బంతిపూల సాగుకు సుమారు ఆరు వేల మొక్కలు వరకు అవసరం ఉంటుంది. తెగుళ్లు, పురుగులు ఆశించకుండా మొక్కకి మొక్కకి మధ్య అడుగు, సాలుకు సాలు మధ్య రెండు అడుగుల దూరం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. మొదట్లో వేపపిండి, 16-20-0-13 బలం వినియోగించారు. మొక్కలను చీడపీడలు ఆశించకుండా మూడు రోజులకు ఒకసారి మందులు పిచికారీ చేయాలి, 20రోజుల తర్వాత డీఏపీ, మోనోక్రోటోపాస్ వినియోగిస్తున్నారు. అప్పుడప్పుడు సేంద్రియ ఎరువులు సాళ్లలో వాడుతున్నారు.

అదును పదును చూసి సాగు

బంతి పూల సాగు లాభసాటిగా మారి ఎకరం భూమిలో కేవలం రూ.30వేల పెట్టుబడితో లక్ష వరకు ఆదాయాన్ని పొందవచ్చు. ఎకరం బంతి పూల సాగులో రెండు నుంచి మూడు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. రైతులు అదును పదును చూసి సాగు చేసుకుంటే సిరులు పొందవచ్చు.

- రుషి, రైతు, వెంకటరాజులకండ్రిగ, సత్యవేడు

మార్కెట్ సౌకర్యం..

బంతి నాటిన 45రోజుల నుంచి పూలు కోతకు వస్తాయి. రోజు మార్చి రోజు కోయాల్సి ఉంది. పువ్వులకు ముందే నీరు అందించినట్లయితే తాజాగాను, విచ్చుకున్న పువ్వులే కోస్తే ఎక్కువ బరువు వస్తోంది. పువ్వులను తమిళనాడులోని కొయంబేడు మార్కెట్, గుమ్మిడిపూండి, మాదరపాకం, సత్యవేడు, వరదయ్యపాళెం ప్రాంతాలకు తరలించి అధిక లాభాలు పొందుతున్నారు.

ప్రశ్న జవాబు

రేణిగుంట, న్యూస్‌టుడే: వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు సమాధానాలు చెప్పిన మండల వ్యవసాయాధికారి సునీల్‌కుమార్.

ప్రశ్న: రబీలో వరి పంటకు ఎన్‌పీకే ఎంత మోతాదులో వేసుకోవాలి?

- చంద్రయ్య, రైతు, వెంకటాపురం

జవాబు: రబీ కాలంలో 48 కిలోల నత్రజని, 24 కిలోల పాస్పరస్, 16 కిలోల పొటాషియం, 20 కిలోల జింక్ సల్ఫేట్ ఒక ఎకరానికి ఒకేసారి వేసుకోవాలి.

కూరగాయల పంటలు కాపాడుకుందాం



పుత్తూరు, న్యూస్‌టుడే: వాతావరణ మార్పులతో కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కూరగాయల పంటలు దెబ్బతినకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని పుత్తూరు ఉద్యానాధికారిణి వెంకటసౌజన్య సూచించారు.
❖ వాలిపోయిన మొక్కలను నిలబెట్టాలి. ❖ ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చొప్పున వేసుకోవాలి. ❖ నారుకుళ్లు తెగులు ఆశించకుండా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములను లీటరు నీటిలో కలిపి నారు మళ్లను ముందుగా మందు ద్రావణంతో బాగా తడపాలి. ❖ మొక్కలు తేరుకున్న తర్వాత స్థూల పోషకాల మిశ్రమాన్ని 5 గ్రాములతో పాటు సూక్ష్మ పోషకాల మిశ్రమం 2.5గ్రాముల లీటరు నీటిలో కలిపి ఒకదాని తర్వాత మరొకటి వారం రోజుల వ్యవధిలో 2-3సార్లు పిచికారీ చేయాలి. ❖ వేరుకుళ్లు ఆశించిన తోటల్లో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు లేదా కాపర్ హైడ్రాక్సైడ్ 20 గ్రాములు లేదా కార్బండిజిమ్ 10 గ్రాములు చొప్పున 10 లీటర్ల నీటిలో కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలి. గొంగళి పురుగులు ఆశిస్తే నివారణకు క్లోరిపైరిపాస్ 2.5గ్రాములు లేదా నొవాల్యురాన్ 0.15మి.లీ వంటి కీటకనాశిని మందులను లీటరు నీరు చొప్పున పిచికారీ చేస్తే అదుపు చేయవచ్చు.

పాల ధరలు పెంచుకోవడం ఇలా..



శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పశుపోషకులు పాల ధరలు పెంచుకోవడంపై అవగాహన కలిగి ఉండాలి. అప్పుడే ఆశించిన మేరకు పాల ఉత్పత్తులను పెంచుకోవడంతో పాటు ఆర్థికంగా లాభాలు పొందే అవకాశముంది.
▸ పాలల్లో వెన్న, ఘన పదార్థాల శాతం (ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్) పెరగాలంటే పాడి పశువులకు రోజూ పాలకంకుల దశలో కోసిన 20 నుంచి 30 కిలోల పచ్చి మేతతో పాటు కచ్చితంగా 8 కిలోల ఎండు మేతను చిన్న ముక్కలుగా ఇవ్వాలి. ▸ ప్రతి రోజూ పాలు పితికే సమయం, వ్యక్తి, విధానం ఒకే విధంగా ఉండేలా చూసుకోవాలి. ▸ పశువుకు పాలు పితికే ఒక గంట ముందు నీటిని తాపరాదు. ▸ బీరు పొట్టు, పాలబడి పిండి, మొక్కజొన్న పిండి, మిగిలిపోయిన అన్నం ఎక్కువగా ఇవ్వడం వల్ల ఆమ్ల అజీర్తి చేసి పశువులు అనారోగ్యానికి గురికావడంతో పాటు పాల ఉత్పత్తి, ఫ్యాట్ ఎస్ఎన్ఎఫ్ తగ్గిపోతుంది. తద్వారా ధర తగ్గిపోయే అవకాశముంది. ▸ మేతతో పాటు రోజూ ప్రతి మూడు లీటర్ల పాలకు ఒక కిలో దాణా, పూటకు 50 గ్రాముల మినరల్ మిక్చర్ (ఖనిజ లవణ మిశ్రమం) ఇవ్వడం వల్ల ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ పెరుగుతుంది. ▸ పాలు పితికే సమయంలో పొదుగును సున్నితంగా రుద్దడం ద్వారా పాల దిగుబడి పెంచుకునేందుకు వీలుంటుంది. ▸ పాలను ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ తక్కువగా వచ్చే పశువులకు రోజూ వంట సోడా 120 నుంచి 240 గ్రాములు మూడు రోజుల పాటు తినిపించడం వల్ల పెంచుకునే వీలుంటుంది. ▸ పొదుగువాపు వ్యాధి రాకుండా పాలు పితికిన వెంటనే శుభ్రంగా నీటితో కడిగి శుభ్రమైన వస్త్రంతో తుడవాలి. ▸ పాలు పితికిన వెంటనే 15 నిమిషాల పాటు పడుకోకుండా పచ్చిదాణా తినిపించాలి. దీంతో పొదుగువాపు రాకుండా నివారించవచ్చు.

- ఎన్.వి.శ్రీకాంత్‌బాబు, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు, శ్రీకాళహస్తి

220 నీటి సంఘాలకు ఎన్నికలు

☛ విడుదలైన ప్రకటన
☛ జిల్లాలో రాజకీయ సందడి



సాగునీటి చెరువు

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే: సాగు నీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యూయూఏ) ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎన్నికల నిర్వహణాధికారి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆమోదంతో జిల్లా జలవనరుల శాఖ ఎస్ఈ విజయకుమార్‌రెడ్డి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలో 220 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఓటర్ల జాబితా తయారీ నుంచి పోలింగ్ ప్రక్రియను 40 రోజుల్లో ముగించేలా జలవనరుల శాఖ, రెవెన్యూ శాఖల అధికారులు దృష్టి సారించారు. ఈ ప్రక్రియ గతంలో 90 రోజులు ఉండేది.

పునరుజ్జీవం దిశగా..

రైతు ప్రతినిధులు సభ్యులుగా ఉండే సాగునీటి వినియోగదారుల సంఘాలు 2003లో ఆవిర్భవించాయి. 2015లో ఈ ఎన్నికలు జరగ్గా కాలపరిమితి 2020తో ముగిసింది. ఆపై అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీంతో జలవనరుల చెరువులు, మేజరు ప్రాజెక్టుల నిర్వహణ అటకెక్కింది. చెరువులు, ప్రాజెక్టుల పునరుద్ధరణ పనులు పూర్తిగా ఆగిపోవడంతో వీటికి ప్రస్తుతం నీరు చేరే పరిస్థితి లేదు. ఈ కారణంగానే వర్షాలు సమృద్ధిగా కురిసినప్పటికీ పంటల సాగుకు సాగునీరు అందడం లేదు. ఈ క్రమంలో సాగునీటి సంఘాలను పునరుద్ధరిస్తామని కూటమి నాయకులు ఎన్నికల్లో హామీ ఇవ్వడంతో అధికారంలోకి రాగానే అమలు దిశగా చర్యలు ప్రారంభించారు.

షెడ్యూల్ ఇలా..

▸ ఎన్నికల నిర్వహణాధికారి కలెక్టర్ ఆదేశిత అధికారులను నియమిస్తారు. ▸ ఈ నెల 21 నుంచి 31లోగా రెవెన్యూ, జలవనరుల శాఖ అధికారులు సాగునీటి సంఘాల పరిధిలో ఓటర్ల వివరాల నమోదు, అభ్యంతరాల స్వీకరణ, 31న ఆయా సంఘాల పరిధిలో జాబితా ప్రదర్శిస్తారు. ▸ నవంబరు 9న కలెక్టర్ ఆధ్వర్యంలో తుది జాబితా ప్రకటన. దీనిపై మళ్లీ అభ్యంతరాల స్వీకరణ. ఆపై 18-20 లోగా తుది ఓటర్ల జాబితా ప్రకటన

20న నోటిఫికేషన్

▸ 21 నుంచి 23 లోగా ఎన్నికల నిర్వహణ ▸ ఆరోజే ఫలితాల వెల్లడి

3, 4 తేదీల్లో యూటీఎఫ్ మహాసభలు



కలెక్టర్‌కు లేఖ అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: నవంబరు 3, 4 తేదీల్లో పూతలపట్టులో జరిగే యూటీఎఫ్ మహాసభలకు హాజరుకావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను యూటీఎఫ్ నాయకులు కోరారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. అపార్ నమోదులో ఎదురవుతున్న సమస్యలు, నాడు-నేడు అంశాలపై ప్రస్తావించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవరమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, మణిగండన్, సుధాకర్‌రెడ్డి, రెడ్డెప్ప నాయుడు, సరిత పాల్గొన్నారు. ▸ డ్రిప్ పరికరాల మంజూరు నిమిత్తం ప్రాథమిక తనిఖీ 10 రోజుల్లో పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 26,193 హెక్టార్లకుగాను 25,972 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు, 1,193 మందికి పరికరాల్ని పంపిణీ చేశామన్నారు. ▸ పండ్ల పరిశ్రమలో నెలకొన్న సమస్యల్ని పరిష్కరించాలని కలెక్టర్‌ను.. జిల్లా పండ్ల పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు గోవర్ధన్ బాబీ కోరారు. రానున్న సీజన్‌లో రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు చేపట్టాలన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



▸ ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక ▸ జస్టిస్ వేలుమణి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక సోమవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబసభ్యులతో కలిసి శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ▸ శ్రీవారిని సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం, అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

త్యాగధనుల స్మరణే అమరవీరులకు శ్రద్ధాంజలి





▸ అమరవీరుల స్థూపం, పోలీసు తుపాకీకి శ్రద్ధాంజలి ఘటిస్తున్న అధికారులు, చిత్రంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు ▸ అమరవీరుల కుటుంబ సభ్యులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: దేశ సరిహద్దులో రేయింబవళ్లు విధులు నిర్వర్తిస్తూ ఎందరో వీరమరణం పొందుతున్నారని, అలాంటి త్యాగధనుల స్మరణే అమరవీరులకు నిజమైన శ్రద్ధాంజలి అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు తెలిపారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కార్యాలయ మైదానంలో సోమవారం 'అమరవీరుల సంస్మరణ దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేమని, వారి విధులు గౌరవిస్తూ అన్ని విధాలా సహకరించాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ మాట్లాడారు. వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అంతకు ముందు స్మృతి పరేడ్ నిర్వహించారు. అనంతరం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే జగన్మోహన్, మేయర్ అముద, ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు సాయినాథ్, ప్రభాకర్, పార్థసారథి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

అంతర జిల్లాల ఖోఖో టోర్నీకి విరాళం



ఆర్థిక సాయం అందిస్తున్న చెన్నకేశవులు నాయుడు

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో 43వ అంతర జిల్లాల ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీలు ఈ నెల 25 నుంచి 27 వరకూ కాణిపాకం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరగనున్నాయి. ఈ పోటీల నిర్వహణ నిమిత్తం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తండ్రి చెన్నకేశవులు నాయుడు.. జీజేఎం ఛారిటబుల్ ఫౌండేషన్ తరపున రూ.50 వేల విరాళాన్ని సోమవారం ఖోఖో సంఘ నాయకులకు అందజేశారు.

ఖోఖో, ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

చిత్తూరు(క్రీడలు): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాలబాలికల ఫుట్‌బాల్, అండర్-17 ఖోఖో బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు సోమవారం చిత్తూరులోని మెసానికల్ మైదానంలో జరిగాయి. ఫుట్‌బాల్ జట్లు హిందూపూర్‌లో, ఖోఖో జట్లు అనకాపల్లిలో త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడనున్నాయి.

రాజగోపాల్‌నాయుడుకి ఘన నివాళి



రాజగోపాల్‌నాయుడుకి నివాళి అర్పిస్తున్నా గల్లా రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారి తదితరులు

తవణంపల్లె, న్యూస్‌టుడే: మాజీ ఎంపీ పాటూరు రాజగోపాల్ నాయుడు 27వ వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని దిగువమాఘంలోని రాజన్న మెమోరియల్ పార్క్‌లో నిర్వహించారు. అమరరాజా గ్రూప్ సంస్థల వ్యవస్థాపక ఛైర్మన్ గల్లా రామచంద్రనాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమర ఆసుపత్రి ఎండీ డాక్టర్ రమాదేవి.. రాజగోపాల్‌నాయుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గోపీ, మాజీ సర్పంచి కుమార్‌నాయుడు, రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్ రాళ్ళపల్లి, యల్లంపల్లి సురేష్, గల్లా అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి

కల్లూరు, న్యూస్‌టుడే: పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. తూర్పు అటవీ విభాగం పాళెం పంచాయతీలోని కోటపల్లెలో ఆదివారం రాత్రి ఏనుగుల గుంపు సుబ్రహ్మణ్యం అనే రైతుకు చెందిన మామిడి తోటలో మూడు టన్నుల కాయలను తినేశాయి. మరో టన్ను నేలపాలు చేశాయి. 55 మామిడి చెట్ల కొమ్మలు విరిచాయి. వెంకట్రామయ్య మామిడి తోటలో ఐదు మామిడి చెట్ల కొమ్మలు విరిచి, ఒక కొబ్బరి చెట్టును కూల్చివేశాయి. రఘు పొలంలో రెండు మామిడి చెట్ల కొమ్మలు విరిచేశాయి. ఎఫ్ఆర్వో థామస్‌కుమార్, ఎఫ్ఎస్వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవో మున్నా పంటలను పరిశీలించారు.

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతు ధర)	129
రిటైల్	142
లేయర్	115
బ్రాయిలర్స్	206
బ్రాయిలర్స్ స్కిన్ లెస్	234
లేయర్ మాంసం	195

చిత్తూరు నుంచి ఆర్డినరీ బస్సు సర్వీసులు నడపాలి

గ్రీవెన్స్‌లో 176 వినతులు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతుల్ని సమర్పించేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, డీఆర్వో పుల్లయ్య, ఆర్డీవో శ్రీనివాసులు.. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గ్రీవెన్స్‌లో మొత్తం 176 వినతులు అందగా, వాటిలో రెవెన్యూ సమస్యలు 151, ఇంకా ఇతర శాఖలకు సంబంధించిన అర్జీలు ఉన్నాయి. ▸ చిత్తూరు నుంచి తిరుపతి, కుప్పం, మదనపల్లి ప్రాంతాలకు ఏపీఎస్ఆర్టీసీ ద్వారా ఆర్డినరి బస్సు సర్వీసులు నడపాలని చిత్తూరు స్మార్ట్ సిటీ సభ్యులు కలెక్టర్‌కు విన్నవించారు. గతంలో ఆర్డినరి, సూపర్ ప్యాసింజర్ సర్వీసులు ఉండేవని, వీటిలో ఛార్జీలు తక్కువగా ఉండటంతో పేద ప్రయాణికులకు సౌలభ్యంగా ఉండేదన్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఛార్జీలు అధికంగా ఉన్నాయన్నారు. చిత్తూరు నుంచి చెన్నైకి వెళ్లే బస్సు సర్వీసు ఏడాది క్రితం రద్దు చేశారని, దీన్ని పునరుద్ధరించాలని కోరారు. ▸ ఉప కేంద్రాల్లో పనిచేసిన ఏఎన్ఎంల సర్వీసును రెగ్యులర్ చేసి ఉద్యోగోన్నతులు కల్పించాలని ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. 2008లో ఉద్యోగాల్లో చేరిన తమకు ఇప్పటివరకూ వేతనాలు పెంచలేదన్నారు. తమ తర్వాత చేరిన వారికి వేతనాలు పెంచారని, ఉద్యోగోన్నతులు కల్పించారని వాపోయారు. దూర ప్రాంతాలకు బదిలీ చేస్తామని చెప్పడం బాధాకరమన్నారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని విన్నవించారు. ▸ రజక కులానికి చెందిన బాలికను గర్భిణిని చేసిన వాలంటీర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెదేపా రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి షణ్ముగం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శాంతిపురం మండలం రాళ్లబుదుగూరు పంచాయతీ శెట్టిగారి కురబూరు గ్రామంలో తొమ్మిది నెలల క్రితం వాలంటీర్‌గా పనిచేసిన వెంకటాచలం.. ఓ బాలికను బెదిరించి అత్యాచారం చేశాడని ఆరోపించారు. బాలిక సంరక్షణ బాధ్యతను ప్రభుత్వం చూసుకోవాలని, రూ.50 లక్షలు పరిహారం అందజేయాలని కోరారు. ▸ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య నిమిత్తం బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని కొనసాగించాలని మాల మహానాడు ఐక్యవేదిక జిల్లా సంయుక్త కార్యదర్శి ధనరాజ్ విన్నవించారు. ▸ పెనుమూరు మండలం సాతంబాకంలో పీహెచ్‌సీని నెలకొల్పాలని శాంతియుత ఉద్యమ రైతు వెంకటాచలం నాయుడు విన్నవించారు. ▸ తమవారిని జైలు నుంచి విడిపించాలని యాదమరి మండలం మాపాక్షి షికారి కాలనీవాసులు విన్నవించారు. తమ వద్ద ఎప్పటి నుంచో తుపాకులు ఉన్నాయని, లైసెన్సు లేదనే కారణంతో తమవారిని అరెస్టుచేశారని వాపోయారు. ▸ సోమల మండలం ఎ.గొల్లపల్లెలో యానాదుల భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు వినతిచేశారు.

జాతీయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జాతీయ పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి చిన్నారెడ్డి సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉర్దూ భాషాభివృద్ధి, సాహిత్య, విభిన్న విభాగాల్లో అత్యుత్తమ సేవలందించిన వారికి ఈ పురస్కారాలు అందిస్తారన్నారు. అర్హులైన వారు పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ప్రిన్సిపాళ్ల ద్వారా ఈనెల 25వ తేదీ లోగా విజయవాడ, భవానీపురం, హెచ్‌బీకాలనీ, మాలవిక విల్లా, 76-1-6ఎ/1, 2 చిరునామాకు స్వయంగా లేదా పోస్టు, కొరియర్ ద్వారా దరఖాస్తులు పంపాలని ఆయన కోరారు.

జూడో రాష్ట్రస్థాయి జట్ల ఎంపిక

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన జూడో రాష్ట్ర స్థాయి జట్టు ఎంపిక పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీల ముగింపు సందర్భంగా సోమవారం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు ఇచ్చి సత్కరించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బాబు, పారిశ్రామికవేత్త జగన్నాథంనాయుడు, పుత్తూరు ఉప విద్యాశాఖాధికారి ప్రభాకర్‌రాజు, ఎంఈవో బాలయ్య, ప్రధానోపాధ్యాయిని రాజేశ్వరి, రాష్ట్ర పరిశీలకులు ప్రతాప్‌రెడ్డి, కోచ్ గోపి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. రాష్ట్ర జట్టుకు అనంతపురం నుంచి.. రాజు, దివాకర్‌రెడ్డి, మద్దుకృష్ణ, దీక్షశ్రీ, లక్ష్మారెడ్డి, యశశ్విని, మౌనిక, చిత్తూరు నుంచి.. మదన్, రామాచారి, కర్నూలు నుంచి.. హిమతేజ, పురందర్, చైతన్యగౌడ, కృష్ణాజిల్లా నుంచి.. లక్ష్మణ్‌కుమార్, కీర్తన, భావన, విశాఖ పట్టణం నుంచి.. యశ్వంత్, వైఎస్ఆర్ కడప జిల్లా నుంచి.. వెంకటలక్ష్మి, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి శ్రావణిలు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బండపై నుంచి పడి కూలీ మృతి



వేణుగోపాల్ (పాత చిత్రం)

కుప్పం పట్టణం: బండ నుంచి కిందపడి వ్యక్తి మరణించగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు. పురపాలిక పరిధిలో 2వ వార్డు శీగలపల్లె శ్రీనివాసులుకు చెందిన వ్యవసాయ భూమి పక్కన ఉన్న బండను తొలగించేందుకు కూలీలతో చర్యలు చేపట్టారు. ఆదివారం సాయంత్రం బండను పగులగొడుతుండగా బండ చీలి కిందపడింది. దానిపై ఉన్న ముగ్గురు కార్మికులు అదుపుతప్పి 25 అడుగులు ఎత్తు నుంచి కిందపడ్డారు. కనమనపల్లెకు చెందిన వేణుగోపాల్(48)ను బెంగుళూరుకు తరలించగా అక్కడ మృతి చెందాడు. కనమనపల్లెకు చెందిన శ్రీనివాసులు, తమిళనాడుకు చెందిన కుప్పుస్వామి గాయపడ్డారు. దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ జీటీనాయుడు తెలిపారు.

పురుగుమందు తాగి విద్యార్థి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పురుగుమందు తాగి విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన లక్ష్మీనాయక్‌తండాలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. శ్రీకాంత్ కుమారుడు బి.నరేంద్ర(17) పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. కొన్ని రోజులుగా పాఠశాలకు సక్రమంగా వెళ్లకపోవడంతో తల్లిదండ్రులను పిలిపించి మందలించి పంపించారు. సోమవారం విద్యార్థితోపాటు తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లగా తాను ఇక్కడ చదవనని, టీసీ ఇస్తే బయటకు వెళ్లిపోతానని విద్యార్థి డిమాండ్ చేశారు. అనంతరం ఇంటికి వెళ్లాక పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తల్లిదండ్రులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

భర్తను హతమార్చిన కేసులో భార్యకు జీవితఖైదు



గోవిందమ్మ

చిత్తూరు (న్యాయ విభాగం), న్యూస్‌టుడే: భర్తను కిరాతకంగా హతమార్చిన కేసులో భార్యకు జీవిత ఖైదు విధిస్తూ సోమవారం స్థానిక ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి సుంకర శ్రీదేవి తీర్పు చెప్పారు. కోర్టు ఇన్‌ఛార్జి పీపీ పులికల్లు రవీంద్రారెడ్డి కథనం మేరకు.. పాలసముద్రం మండలం నరసింహాపురానికి చెందిన మునివేలు, గోవిందమ్మకు 2005లో వివాహం జరగ్గా వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. వీరు వ్యవసాయ కూలీలు. గోవిందమ్మ వ్యసనాలకు బానిసవడంతో ఇరువురి నడుమ తరచూ గొడవలు జరిగేవి. దీంతో పథకం ప్రకారం భర్తను హతమార్చాలని ఆమె నిర్ణయించుకుని 2017 అక్టోబరు 23న రాత్రి భర్తకు మత్తుమందు కలిపిన అన్నం వడ్డించడంతో అతడు తిని మత్తులోకి వెళ్లాడు. వెంటనే అతడిపై పెట్రోల్ పోసి తగలబెట్టడంతో శరీరం కాలిపోయి కేకలు వేస్తూ ఇంట్లో నుంచి వెలుపలికి రావడంతో స్థానికులు గుర్తించి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నాటి సీఐ చంద్రశేఖర్ గోవిందమ్మపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. పూర్వాపరాలు పరిశీలించిన పిదప నేరం రుజువు కావడంతో జీవితఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

కారు టైరు పేలి గుట్టురట్టు



ఎర్రచందనం దుంగలు పట్టుకున్న పోలీసులు

పలమనేరు, న్యూస్‌టుడే: కారు టైరు పేలడంతో అక్రమ రవాణా గుట్టు రట్టయింది. పట్టణానికి 10 కి.మీ దూరంలోని ఇంద్రానగర్ వద్ద ఎర్రచందనం దుంగలు తరలిస్తున్న కారు రోడ్డు పక్కకు వాలిపోయింది. గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు కారును పరిశీలించగా అందులో 12 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. ఆదివారం అర్ధరాత్రి దుండగులు తమిళనాడు రాష్ట్రానికి ఎర్రచందనం తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వాటి విలువ రూ.14 లక్షలు ఉంటుందని పలమనేరు సీఐ నరసింహరాజు తెలిపారు. కారుతో సహా దుంగలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఆయన చెప్పారు. వీటిని ఎవరు, ఎక్కడి నుంచి రవాణా చేస్తున్నారనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చిత్తూరు

● చిత్తూరు ● పూతలపట్టు ● గంగాధరనెల్లూరు ● నగరి

ప్రజా సమస్యల పరిష్కారానికి మొబైల్ యాప్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: చిత్తూరు నియోజకవర్గంలో ప్రజలు, పార్టీ కార్యకర్తల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మొబైల్ యాప్ అందుబాటులోకి తీసుకురానున్నామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. స్థానిక తెదేపా జిల్లా కార్యాలయంలో ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్న పార్టీ సభ్యత్వ నమోదుపై చిత్తూరు నియోజకవర్గంలోని అన్ని డివిజన్లు, మండలాలు, గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సోమవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో లక్ష మందితో తెదేపా సభ్యత్వం చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, సభ్యత్వ నమోదులో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ బహుమతులు, పదవులు వచ్చేలా కృషి చేస్తామని హామీనిచ్చారు. ఇది పూర్తికాగానే మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెస్తామని, అందులో అందరి పేర్లు నమోదు చేస్తామని, పార్టీ కార్యక్రమాలు, సమస్యలు, పరిష్కారాలు అందులో నమోదు చేస్తామని ఇది పూర్తిగా పారదర్శకమని చెప్పారు. 2025 నుంచి 2029 వరకు నియోజకవర్గంలో అందరినీ ఏకతాటిపైకి తెచ్చేలా చర్యలు చేపడుతున్నామని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, మేయర్ అముద, రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, నాయకులు వసంత్‌కుమార్, సుబ్రహ్మణ్యం నాయుడు, బాలాజీ నాయుడు, మోహన్‌రాజ్, వెంకటేష్‌యాదవ్ పాల్గొన్నారు.

పాఠశాలకు పోర్టబుల్ మైక్ వితరణ.. పుత్తూరు: పరమేశ్వరమంగళంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలకు.. రామకృష్ణ తన భార్య రమాదేవి వర్ధంతి పురస్కరించుకుని రూ.10,500 విలువ చేసే పోర్టబుల్ మైక్‌ను సోమవారం వితరణ చేశారు. రమాదేవి చిత్రపటానికి నివాళులర్పించారు. గతేడాది పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన కీర్తన కు రూ. 2 వేలు, మిత్రకు రూ.వెయ్యి అందజేశారు. మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. భాస్కర్‌నాయుడు, ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మహేశ్వర్‌రెడ్డి

బాధ్యతల స్వీకరణ.. పాలసముద్రం: ఎంపీడీవోగా మహేశ్వర్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం నుంచి ఆయన ఇక్కడకు వచ్చారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ


కాంస్య పతకాన్ని సాధించిన రోహిత్‌తో ఉపాధ్యాయులు

ఐరాల: నంద్యాలలో ఈ నెల ఆరో తేదీ నుంచి పదో తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి రోహిత్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడని ప్రధానోపాధ్యాయురాలు బి.కోమల సోమవారం తెలిపారు. కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడని చెప్పారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ యాదవ్, కార్యదర్శి రమేష్.. ఆ విద్యార్థిని అభినందించారు. వ్యాయమ ఉపాధ్యాయుడు దేవా పాల్గొన్నారు.


మా బాధల్ని తీర్చండి

● మండలాల్లో ఆలకించట్లేదు
● క్షేత్రస్థాయిలో పరిష్కారం దక్కట్లేదు

న్యూస్‌టుడే, చిత్తూరు కలెక్టరేట్

క్షేత్రస్థాయిలో కాళ్లరిగేలా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవట్లేదు.. మా బాధల్ని వినేవారు కరవయ్యారు.. మండల స్థాయిలో చిన్నపాటి సమస్యలకు పరిష్కారం దక్కకపోవడంతో మీ వద్దకు వచ్చాం.. కనీసం జిల్లా ఉన్నతాధికారులు.. మా బాధల్ని ఆలకించి పరిష్కారం చూపాలని కోరారు అర్జీదారులు.

పింఛను పునరుద్ధరించండి..



ఎన్నో ఏళ్లుగా వృద్ధాప్య పింఛను వస్తుండేది. ఏడాది క్రితం దాన్ని రద్దు చేశారు. పింఛను నగదు వైద్య అవసరాలకు ఉపయోగపడేది. ఇటీవల దాన్ని రద్దు చేయడంతో నానా ఇబ్బందులు పడుతున్నా. సచివాలయంలో మళ్లీ దరఖాస్తు చేసుకున్నా అక్కడ ఎవరూ కనీసం పట్టించుకోలేదు. అధికారులు స్పందించి పింఛను పునరుద్ధరించాలని వేడుకుంటున్నా.
-చాబాసాహెబ్. కొత్తపల్లిమిట్ట, ఎస్ఆర్‌పురం మండలం

పొలానికి వెళ్లనీయడం లేదు..



మా తల్లి శేషమ్మ పేరిట పలు సర్వే నంబర్లలో భూమి ఉంది. దీనిపై పట్టాదారు పాసుపుస్తకం ఉంది. ఈ పొలాన్ని వేరొకరు ఆక్రమించుకున్నారు. పంట బావి కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు కత్తిరించాడు. మా పొలానికి వెళ్లేందుకు దారి లేకుండా ఫెన్సింగ్ వేశాడు. అధికారులు స్పందించి పొలానికి దారి సౌకర్యం కల్పించాలని విన్నవించుకుంటున్నా. **-భీష్మయ్య, అగరమంగళం గ్రామం, జీడీనెల్లూరు మండలం**

వయోభారంతో ఇబ్బందిపడుతున్నా..



నా భర్త అనారోగ్యంతో మరణించారు. వయోభారంతో నేనూ ఇబ్బంది పడుతున్నా. నాకు అనారోగ్య సమస్యలు ఉన్నాయి. కూలి పనులు చేసే శక్తి లేదు. వితంతు పింఛను కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా స్పందన లేదు. అధికారులు స్పందించి మంజూరు చేస్తే ఎంతో ఆసరాగా ఉంటుంది.
-నరసమ్మ, ముక్కళతూర్తు, జీడీనెల్లూరు మండలం

పిచ్చిమొక్కల తొలగింపు

స్పందనకు వందనం

జీడీనెల్లూరు-తూగుండ్రం మార్గంలో అంబోదరపల్లె మలుపు వరకు రెండు విద్యుత్తు స్తంభాలకు పిచ్చిమొక్కలు పాకి, ప్రమాదకరంగా ఉన్న వైనాన్ని ఈ నెల 19న 'ఈనాడు'లో ప్రచురితమైంది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. పర్యవేక్షకులు హరి, సహాయ పర్యవేక్షకులు ప్రవీణ్ ఆధ్వర్యంలో సోమవారం సిబ్బందిచే విద్యుత్తు తీగలకు పాకిన పిచ్చిమొక్కలు తొలగింపజేశారు. తద్వారా విద్యుదాఘాతం జరగకుండా నివారించారు.
-న్యూస్‌టుడే, జీడీనెల్లూరు

హమ్మయ్య... ప్రమాదకర ట్యాంకు తొలగించారు

ఈనాడు కథనానికి స్పందన



ఏళ్ల తరబడి గ్రామ నడివీధిలో ప్రమాదకరంగా శిధిలావస్థకు చేరిన తాగునీటి ట్యాంకును ఎట్టకేలకు తొలగించారు. ఆముదాల పంచాయతీ రేణుకాపురంలోని గ్రామ వీధిలో ప్రమాదకరంగా శిధిలావస్థకు చేరుకున్న తాగునీటి ట్యాంకుపై గత నెలలో 'శిధిలావస్థలో తాగునీటి ట్యాంకు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఇన్‌ఛార్జి ఎంపీడీవో విద్యావతి ఆదేశాల మేరకు ఈవోఆర్డీ రమేష్‌బాబు గ్రామస్థుల సహకారంతో తాగునీటి ట్యాంకు కూల్చేశారు. **-న్యూస్‌టుడే, పాలసముద్రం**

సృజనకు పదును


విజేతలతో రెయిన్‌బో పాఠశాల కరస్పాండెంట్ మోహన్‌రెడ్డి

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీతత్వం అలవరచుకుని వారిలో సృజనాత్మకతకు పదును పెట్టాలని రెయిన్‌బో పాఠశాల కరస్పాండెంట్ మోహన్‌రెడ్డి అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలోని రెయిన్‌బో పాఠశాలలో సోమవారం ప్రతిభా పాటవ పోటీ నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు పరీక్ష రాశారు. ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులు సృజనాత్మకతతో రాసి బహుమతులు సాధించారు. తనుశ్రీ, ఐశ్వర్య, యమున వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ మోహన్‌రెడ్డి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చక్కగా రాణించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ శరవణ, ఉపాధ్యాయులు

పుత్తూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించడానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో పాఠశాలల్లో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించడం అభినందనీయమని పుత్తూరు శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపల్ శరవణ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో ఈనాడు ప్రతిభ పోటీల్లో భాగంగా 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీ సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు విద్యార్థుల మేధస్సుకు పదును పెడతాయన్నారు. వారు వీటిని సద్వినియోగం చేసుకుని చక్కగా రాణించాలన్నారు. ఈ పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు జీవనశ్రీ, లోకేష్, ప్రతీక్ష విజేతలుగా నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ శరవణ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోమల్, దిల్లీబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాలంటీర్‌ను కఠినంగా శిక్షించాలి

చిత్తూరు గ్రామీణ: శాంతిపురం మండలానికి చెందిన 13 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డ వాలంటీరు వెంకటాచలంను కఠినంగా శిక్షించాలని రజక సమాఖ్య సంఘాల వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు షణ్ముగం డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కలెక్టరు దృష్టికి తీసుకెళ్లితే రూ.45 వేలు ఆర్థిక సాయం అందించారన్నారు. బాధిత కుటుంబానికి ఇంటి స్థలం కేటాయించి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుడి భార్యకు చెక్కు అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు(నేర వార్తలు), న్యూస్‌టుడే: పలమనేరు పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ జులై 26న అనారోగ్యంతో మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ జయప్రకాష్ కుటుంబానికి ఎస్పీ మణికంఠ సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, కార్పస్ ఫండ్ నుంచి రూ.లక్ష చెక్కు మృతుడి భార్య రెడ్డెరాణికి అందించారు. పోలీసుశాఖ నుంచి ఎలాంటి సాయం అవసరమైనా తమను సంప్రదించాలని, సాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యాలయ కర్ర్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.


సంజయ్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు శ్యామలాదేవి

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నగరి విద్యార్థి

నగరి,న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో జరగనున్న కబడ్డీ పోటీలకు స్థానిక పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్. సంజయ్ ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయురాలు శ్యామలా దేవి సోమవారం తెలిపారు. అతడిని ప్రత్యేకంగా పీడీ సురేష్ బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రశాంతంగా ముగిసిన టెట్

చిత్తూరు విద్య, న్యూస్‌టుడే: టెట్ జిల్లాలో ప్రశాంతంగా సోమవారంతో ముగిసిందని ఇన్‌ఛార్జి డీఈవో చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెన్నై ప్రగ్య టెక్నాలజీలో మధ్యాహ్నం ఆరుగురు అభ్యర్థులకు.. ఇద్దరు హాజరయ్యారని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం చిత్తూరు, గంగవరం, పి.కొత్తకోట, చెన్నై పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన టెట్‌కు అభ్యర్థులు సకాలంలో హాజరై రాశారన్నారు.

ఆవును హతమార్చిన కేసులో నలుగురి అరెస్ట్

కార్వేటినగరం: మాంబేడు అడవుల్లో మేతకు వెళ్లిన ఆవును వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం హరిజనవాడకు చెందిన పోతిపోగు సూర్య, పట్లూరి తరుణ్, ఎగువగూళూరుకు చెందిన లవకుమార్, హేమాద్రి హతమార్చి మాంసాన్ని విక్రయించడానికి తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకుని ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మిగిలిన ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

వినతులు సకాలంలో పరిష్కరించాలి


వినతిపత్రం స్వీకరిస్తున్న సహాయ కమిషనర్ ప్రసాద్

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని నగరపాలక సహాయ కమిషనర్ ప్రసాద్ సూచించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంజినీరింగ్ 4, రెవెన్యూ 1, పట్టణ ప్రణాళిక 1, అకౌంట్స్ విభాగానికి 1 చొప్పున వినతులు అందాయి. వీటిని సకాలంలో పరిష్కరించాలని సంబంధిత విభాగాల అధికారులను కమిషనర్ ఆదేశించారు. వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విస్తృతంగా భాజపా సభ్యత్వ నమోదు


సభ్యత్వాన్ని నమోదు చేయిస్తున్న భాజపా సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం

చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే: అధిష్ఠానం ఆదేశాల మేరకు పార్టీ సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టాలని భాజపా చిత్తూరు సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం తెలిపారు. సోమవారం చిత్తూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నివాసాలు, దుకాణాదారుల వద్దకు వెళ్లి.. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం వారి వద్ద వాణి నుంచి పార్టీ నంబరుకు మిస్డ్‌కాల్ ఇప్పించి సభ్యత్వాన్ని నమోదు చేయించారు. పార్టీ నాయకులు రామభద్ర, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు పీఈఎస్ విద్యార్థులు


పీఈటీ అరవింద్‌తో యజ్ఞ, సాయిప్రణీశ్వర్

యాదమరి, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు పీఈఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఎస్.జీ.ఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపికను చిత్తూరు నగరంలోని మెసానికల్ మైదానంలో నిర్వహించారు. 23 పాఠశాలలకు చెందిన 130 మంది విద్యార్థులు పాల్గొనగా, పీఈఎస్ పాఠశాల విద్యార్థులు ఎన్.ప్రజ్ఞ, సాయిప్రణీశ్వర్ ఎంపికయ్యారు. వీరు పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ నెల 26, 27, 28 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ వై.వి.కృష్ణబాబు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను, శిక్షణనిచ్చిన పీఈటీ అరవింద్‌ను ఆయన అభినందించారు.

త్వరలో రూ.15 కోట్లతో అంతర్రాష్ట్ర రహదారి పనులు


యాదమరి: అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

యాదమరి, న్యూస్‌టుడే: చిత్తూరు-గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారి విషయంలో రాజీపడేది లేదని ఎమ్మెల్యే మురళీమోహన్ స్పష్టం చేశారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా 155 కమ్మపల్లి, పత్రపల్లి, కృష్ణంపల్లి, నడుమూరు, 184గొల్లపల్లి, బుడితిరెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో రూ.43 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, పలు అభివృద్ధి పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన, భూమిపూజ చేశారు. ఆయా గ్రామాల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాను ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే చిత్తూరు-గుడియత్తం రహదారికి నిధులు మంజూరు చేయాలని కోరానని, ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం దాన్ని బాగుచేయిస్తానని, త్వరలో రూ.15 కోట్లతో పనులు ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గానికి రూ.10 కోట్లు కేటాయిస్తే యాదమరి మండలంలో మొదటి దశలో సీసీరోడ్లకు రూ.2.06 కోట్లు, 69 గోకులం షెడ్లకు రూ.1.30 కోట్లు కేటాయించామన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి సుబ్రహ్మణ్యంనాయుడు, మండల తెదేపా అధ్యక్షుడు మురార్జీయాదవ్, ప్రధాన కార్యదర్శి రబీ, జిల్లా కార్యదర్శి హేమగిరి, తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి అమరనాధనాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షుడు గుణశేఖర్, రవి, చిత్ర పాల్గొన్నారు. **జీడీనెల్లూరు:** సీఎం చంద్రబాబుతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని తెదేపా జిల్లా నేత ప్రకాష్ అన్నారు. ఆయన కలిజవేడు పంచాయతీ వెంకటాపురంలో రూ.4లక్షలతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణానికి సర్పంచి నీలావతి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఉప సర్పంచి రామ్మూర్తిరెడ్డి, నేతలు ప్రభాకర్‌నాయుడు, సుధాకర్‌నాయుడు, రెడ్డెప్పనాయుడు, మాజీ సర్పంచి కరుణాకర్, పంచాయతీ కార్యదర్శి రజని పాల్గొన్నారు.


జీడీనెల్లూరు: వెంకటాపురంలో సీసీరోడ్లకు శంకుస్థాపన చేసిన తెదేపా జిల్లా నేత ప్రకాష్

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం


పట్టణంలో మానవహారంలో విద్యార్థులు

నగరి, న్యూస్‌టుడే: పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో పోలీసులు, విద్యార్థులు సోమవారం మానవహారంగా ఏర్పడి ర్యాలీ చేపట్టారు. సీఐ మహేశ్వర్ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరులను స్మరించడం అందరి బాధ్యతగా భావించాలన్నారు. టవర్‌క్లాక్ వద్ద మానవహారంగా ఏర్పడి అమరవీరుల కోసం మౌనం పాటించారు. అక్కడి నుంచి ఓంశక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సూర్య కళాశాల విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని మార్పుచేయాలి


ఎక్సైజ్ ఎస్సై అంజాద్‌బాషాకు వినతి అందజేస్తున్న మహేష్ తదితరులు

పుత్తూరు, న్యూస్‌టుడే: స్థానిక ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉన్న మద్యం దుకాణాన్ని మార్పు చేయాలని, లేకుంటే నిరసన తెలియజేస్తామని సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్ పేర్కొన్నారు. సోమవారం ఎక్సైజ్ ఎస్సై అంజాద్‌బాషాకు వినతి అందజేసి ఆపై మాట్లాడుతూ ఎల్ఐసీ కార్యాలయానికి వచ్చేవారికి ఇక్కడి మద్యం దుకాణంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దీనికితోడు రోడ్డుపై వాహనాలు నిలుపుతున్నారని, రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. వినతి అందజేసిన వారిలో రమేష్, అనిల్, కాశీ ఉన్నారు.

వైభవంగా శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి పుష్కర కుంభాభిషేకం


ప్రత్యేక పూజల్లో భక్తులు

పుత్తూరు, న్యూస్‌టుడే: శిరుగురాజుపాళెం సమీప తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై వెలిసిన శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ పుష్కర కుంభాభిషేకం సోమవారం ఘనంగా నిర్వహించారు. మూడ్రోజుల పాటు నిర్వహించిన ఈ కుంభాభిషేకం సోమవారం ముగిసింది. స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అన్నదానం చేశారు. నిర్వాహకులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న వరి పంట


కుళ్లిన వరి పంట చూపుతున్న రైతు

వర్షాల కారణంగా 35-యర్లంపల్లెకు చెందిన రైతు హేమచంద్రారెడ్డి తన ఎకరం పొలంలో వేసిన వరి పంట పూర్తి దెబ్బతిన్నది. రూ.75 వేల మేర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు. **-న్యూస్‌టుడే, ఐరాల**

ఏవోకు అభినందనలు


ప్రసన్నఆంజనేయులుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

చిత్తూరు(మిట్టూరు): విద్యుత్తుశాఖ జిల్లా అకౌంట్స్ అధికారిగా సోమవారం ప్రసన్నఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ల ఈఆర్వో అధికారులు, సిబ్బంది సత్కరించి అభినందించారు.

17 వినతుల స్వీకరణ.. చిత్తూరు గ్రామీణ: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 17 వినతులు అందాయని ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. భూ సర్వే, భూ తగాదాలు, పట్టాదారు పాసుపుస్తకం తప్పుల సవరణ, పౌరసేవలకు సంబధించిన అర్జీలు ఉన్నాయన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన.. బంగారుపాళ్యం: చిత్తూరు-పలమనేరు జాతీయ రహదారిలోప్రమాదాలు నివారించేందుకు సీఐ శ్రీనివాసులు సోమవారం మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు.

శిలాఫలకం ధ్వంసం.. నింద్ర: జీఎన్‌కండ్రిగ పంచాయతీ ప్రధాన రోడ్డు వద్ద తాగునీటి కుళాయి ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన మాజీ మంత్రి రోజా శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని వైకాపా మండల కన్వీనర్ వేణుగోపాల్‌రాజు స్థానిక విలేకరులకు తెలిపారు.

మద్యం స్వాధీనం - వ్యక్తి అరెస్టు

బంగారుపాళ్యం: టేకుమందలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వెంకటాచలంను ఏఎస్సై రామచంద్రారెడ్డి అదుపులోకి తీసుకుని అతడి నుంచి 75 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారని, ఆపై అతడిని అరెస్టు చేశామని సీఐ శ్రీనివాసులు తెలిపారు.

ప్రజలకు అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ

నగరి, న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వ నమోదుపై అందరికీ అవగాహన కల్పించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి కె. బాలాజీ పిలుపునిచ్చారు. స్థానిక తెదేపా కార్యాలయంలో సోమవారం నియోజకవర్గ స్థాయిలో పార్టీ సభ్యత్వ నమోదుపై శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆదేశాలతో ఈ శిక్షణ ఇస్తున్నామని, ఈ నెల 26 నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభం కానుందని, తెదేపా కార్యకర్తలకు ఈ విషయమై అవగాహన అవసరమన్నారు. అన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు. ❖ కేవీపీఆర్‌పేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు తెదేపా కార్యదర్శి శ్రీనివాసన్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు శుభాకాంక్షల రూపంలో వచ్చిన నోటు పుస్తకాలను విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఆలోచన.. అద్భుతం..

నూతన ఆవిష్కరణల్లో యువత

న్యూస్‌టుడే, పూత్తూరు

విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి నూతన ఆవిష్కరణలకు నాంది పలికారు.. చక్కటి ఆలోచనలతో వినూత్న ప్రాజెక్టులు సృష్టించి తమ ప్రతిభ చూపుతున్నారు.. నలుగురు కలిస్తే చాలు ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు.. కొత్త ప్రాజెక్టులు సిద్ధం చేసి అందరినీ అబ్బురపరిచి ఔరా అనిపిస్తున్నారు పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ విద్యార్థులు.

ఆటోమేటిక్ రోబోటిక్ వీల్‌ఛైర్..


ఆటోమేటిక్ రోబోటిక్ వీల్‌ఛైర్

సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగ ప్రొఫెసర్ శకుంతల, ఇలంగోళన్ ఆధ్వర్యంలో విద్యార్థులు డింపుల్, దీప్తి, ప్రవీణకుమార్, దినేష్ ఆటోమేటిక్ రోబోటిక్ వీల్‌ఛైర్ తయారు చేశారు. దీని ద్వారా అంగవైకల్యానికి గురైనవారు తోటి మనిషి సాయం లేకుండా వేరొక చోటికి వెళ్లొచ్చు. వీల్‌ఛైర్‌లోనే సెన్సార్‌తో కూడిన ఆర్డినో ప్రాసెసర్‌తో కూడిన జీపీఎస్ నావిగేషన్‌ను ఆపరేట్ చేసుకుని కోరుకున్న చోటకు వెళ్లొచ్చు. మధ్యలో ఆటంకాలు ఎదురైతే సెన్సార్ సాయంతో తన దిశ మార్చుకునేలా దీన్ని రూపొందించడం విశేషం. దివ్యాంగులకు ఇది ఎంతో ఉపకరిస్తుందని విద్యార్థులు తెలిపారు.

ఇట్టే దొరికేస్తారు..


ట్రాఫిక్ లైట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్

ప్రస్తుత పరిస్థితుల్లో ట్రాఫిక్ రద్దీ పెరగడంతో పోలీసులకు నిత్యం తిప్పలే. హెల్మెట్ లేకుండా ప్రయాణం, ఒకే మోటారు వాహనంపై ముగ్గురు, నలుగురు, ఐదుగురు వెళ్లడాన్ని వారు అరికట్టలేకపోతున్నారు. 'మెషీన్ లెర్నింగ్ బేస్డ్ సర్వైలెన్స్ సిస్టమ్ ఫర్ డిడక్షన్ ఆఫ్ బైక్ రైడర్స్ వితవుట్ హెల్మెట్ అండ్ ట్రిపుల్ రైడింగ్' ప్రాజెక్టును అసిస్టెంట్ ప్రొఫెసర్ మోహన సుందరం సహాయంతో విద్యార్థులు సింధు, సాయికిరణ్, సుమంత్, సాయితరుణ్, రేవంత్ రూపొందించారు. ఇందులో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాయంతో కెమెరా అమర్చారు. ఇది నిబంధనలు ఉల్లంఘించిన వారి చిత్రాన్ని నిక్షిప్తం చేసి ట్రాఫిక్ పోలీసులకు సదరు వాహన వివరాలన్నీ పంపుతుంది. ఇలా వారిపై చర్యలు తీసుకునే వీలుంది.

ప్రమాదాల నియంత్రణకు..


నాలుగు చక్రాల వాహనాల ప్రమాదాలు సూచించే పరికరం

రోడ్డు ప్రమాదాల నివారణకు సరికొత్త ఆలోచనకు ప్రొఫెసర్ గోమలవల్లి నేతృత్వంలో విద్యార్థులు పవన్, రమ్యశ్రీ, నిరంజన్, నవీన్, ప్రత్యూష పదును పెట్టారు. 'ఆటోమేటిక్ పేథోల్ డిటెక్షన్ అండ్ అప్‌లోడింగ్ డేటా టూ క్లౌడ్ సర్వర్స్' ప్రాజెక్టు సిద్ధం చేశారు. ఈ ప్రాజెక్టులో అల్ట్రాసోనిక్ సెన్సార్ రెస్ప్‌లేటరీపై క్లౌడ్, జీపీఎస్, పేథోల్ పరికరాలు ఉపయోగించి ఒక ప్రాజెక్టు తయారు చేశారు. కారు, జీపు, ఇన్నోవాకు దీన్ని అమరిస్తే ప్రయాణంలో ఎదురుగా వాహనాలు వచ్చినా, గుంతలు, రాళ్లు స్కాన్ చేసి సెన్సార్ ద్వారా అలారం మోగి కారు ఆగిపోతుంది. తర్వాత అవి క్లియర్ చేస్తేనే వాహనం కదలడానికి సిగ్నల్ ఇస్తుంది. తద్వారా ప్రమాదాలు నివారించవచ్చు.

తాగునీటి పైపులైన్ల మరమ్మతులు చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో నాగరాజు, పక్కన ఎంపీపీ కుమారి

పూతలపట్టు, న్యూస్‌టుడే: గ్రామాల్లో తాగునీటి పైపులైన్ల మరమ్మతులు చేపట్టాలని పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కుమారి అధ్యక్షతన జరిగింది. పూతలపట్టు పంచాయతీ పరిధిలో మరమ్మతులకు గురైన పైప్‌లైన్లు బాగు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని సర్పంచి మసలామణి ప్రశ్నించారు. ఆర్‌అండ్‌బీ రహదారులపై ఉన్న గుంతలు పూడ్చాలని కోరారు. పలుచోట్ల బోరు మోటార్లు కాలిపోయాయని, పైప్‌లైన్లు లీకవుతున్నాయని, వాటిని మరమ్మతు చేయాలని ఎంపీటీసీ సభ్యులు యతీష్, రాణి కోరారు. కాలనీలకు, గ్రామాల్లో నూతనంగా నిర్మించే గృహాల వద్ద విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. ఎంపీడీవో నాగరాజు, జడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైస్ ఎంపీపీలు ద్వారకనాథరెడ్డి, మురళీ, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పలమనేరు

•పలమనేరు • కుప్పం •పుంగనూరు

అయోడిన్ లోపిస్తే అనారోగ్య సమస్యలు

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మనం తీసుకునే ఆహారంలో అయోడిన్ లోపిస్తే అనారోగ్య సమస్యలు వస్తాయని హెచ్ఈ సావిత్రి అన్నారు. ప్రపంచ అయోడిన్ నివారణ దినోత్సవ సందర్భంగా సోమవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో బాలికలకు ఆమె అవగాహన కల్పించారు. ఆహారంలో అయోడిన్ తగ్గితే పిల్లల్లో బుద్ధిమాంద్యం, శారీరక, మానసిక ఎదుగుదల, చురుకుదనం లేకుండా ఉంటారని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జ్యోత్స్న, మహిళా పోలీస్ ఉష, ఏఎన్ఎం లక్ష్మీ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

గుడుపల్లె, న్యూస్‌టుడే: గుడుపల్లె మండలంలో మంగళవారం నుంచి నవంబరు 19వతేదీ వరకు రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు టి.సీతారామ్ తెలిపారు. గతంలో జరిగిన భూ రీ సర్వే, గ్రామాల్లో రైతుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించనున్నట్లు వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పలమనేరు, న్యూస్‌టుడే

సమస్య: పట్టణానికి సమీపంలోని టీఎస్అగ్రహారం చెరువును కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒక వైపు వ్యర్థాలను పోసి మట్టితో కప్పేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రాజ, పలమనేరు

సమాధానం: సిబ్బందిని పంపి ఆక్రమణకు ప్రయత్నిస్తుంటే అడ్డుకుని తగు చర్యలు తీసుకుంటాం.

- ఎన్వీరమణారెడ్డి, కమిషనర్ పలమనేరు

ఘనంగా ఆలయ కుంభాభిషేకం



కుంభాభిషేకం పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని 7వ వార్డు బేవనపల్లెలో శ్రీప్రసన్న ఊరి గంగమ్మ దేవాలయ కుంభాభిషేకం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో వేద పండితులు హోమాలు నిర్వహించి, అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో తెదేపా మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, నాయకులు రమేష్, రాజేష్, మంజునాథ్, గోపీ, మునిరత్నం, గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్రీఓబులేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవం

బైరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మురారిపల్లెలో వెలసిన శ్రీఓబులేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సహస్ర దీపోత్సవం వేడుకగా జరిగింది. ఉదయం అర్చకులు స్వామివారికి అభిషేకం, పుష్పాలంకరణ, పూజలు జరిపారు. కాగా ఈనెల 30 వరకు అఖండలం, దీపోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీఓబులేశ్వరస్వామి

అపార్ కార్డుతో విద్యార్థి సమాచారం

ముందుకు వస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు





▸ **పుంగనూరు:** పురపాలక పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ▸ ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యంకు సమ్మతి పత్రాలు అందిస్తున్న విద్యార్థులు

పుంగనూరు, న్యూస్‌టుడే: విద్యా విధానంలో కేంద్ర ప్రభుత్వం మార్పులు తీసుకువస్తోంది. వన్ నేషన్ వన్ స్టూడెంట్ గుర్తింపు పేరిట కేంద్ర విద్యాశాఖ 12 అంకెలతో అపార్(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమి అకౌంట్ రిజిస్ట్రీ) కార్డు మంజూరు చేయనుంది. ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు తరహాలో ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రారంభించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు కార్డు ఉపయోగాలను వివరించడంతో సమ్మతి పత్రాలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారు.

కార్డులో ఉండే వివరాలు: ప్రతి విద్యార్థికి అందించే డిజిటల్ కార్డులో విద్యార్థి పేరు, జన్మతేది, లింగం, ఫోటో, క్యూఆర్ కోడ్ గుర్తింపు సంఖ్య ఉంటుంది. అకాడమీ సమాచారంతో పాటు విద్యార్థి సాధించిన ఫలితాలు ఇతర విద్యా సమాచారం పొందుపరుస్తారు. ఆన్‌లైన్ నంబరు లేదా క్యూఆర్ కోడ్‌లో విద్యార్థి పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. విద్యార్థులు వివిధ కారణాలతో పాఠశాలలు మారుతుంటారు. అపార్ గుర్తింపు సంఖ్యతో వివిధ రాష్ట్రాల్లోని బోర్డులతో ఏకీకృత వ్యవస్థగా పనిచేస్తోంది. ఒక విద్యాసంస్థ నుంచి మరో విద్యాసంస్థకు మారిన సమయంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ఈ కార్డు ఉపయోగపడుతుంది. విద్యార్థి ప్రోగ్రెస్, ఉపకార వేతనాలు, రివార్డులు తెలుసుకోవచ్చు. ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు పొందడానికి ఈ కార్డు ఉపయోగపడుతోంది. బడికి అర్ధాంతరంగా ఆగిన విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించవచ్చు. ఇంటర్వ్యూలు, ఉద్యోగులు పొందే సమయంలో ధ్రువీకరణ పత్రాల బదులు ఈ కార్డును చూపవచ్చు.

మొదటి దశలో: బహుళ ప్రయోజనాలు గల ఈ అపార్ కార్డును మొదటి దశలో 9, 10 తరగతుల విద్యార్థులకు అందించనున్నారు. తర్వాత ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు జారీకి కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఫలితంగా వారి సమ్మతి పత్రాలను ప్రధానోపాధ్యాయులకు అందిస్తుండడంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు 6,006 ఉండగా వాటిలో 545 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో గల 1.10లక్షల తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల నుంచి సమ్మతి పత్రాలను ప్రధానోపాధ్యాయులు సేకరిస్తున్నారు.

వేగవంతం చేశాం: బహుళ ప్రయోజనాలు గల ఈ అపార్ కార్డులు విద్యార్థులకు అందించడానికి వారి వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు వేగవంతం చేశాం. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం సహకరిస్తున్నారు. **- దేవరాజు , జిల్లా విద్యాశాఖాధికారి, చిత్తూరు**

దరఖాస్తుల గడువు పొడిగింపు

పలమనేరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మెగా డీఎస్సీ కోసం ఉచిత శిక్షణ పొందటానికి దరఖాస్తులకు గడువు పొడిగించినట్లు పలమనేరు సహాయ సాంఘిక సంక్షేమశాఖ అధికారి హైమావతి తెలిపారు. సోమవారం ఆమేరకు ఒక ప్రకటన ఇక్కడ విడుదల చేశారు. ఉచిత బోధన, భోజన వసతితో శిక్షణ పొందటానికి టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 25 వరకు దరఖాస్తులు పంపడానికి అవకాశం ఉందని ప్రకటనలో వివరించారు.

కుప్పం: టెట్ అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ శాఖ తరపున అందించనున్న డీఎస్సీ ఉచిత శిక్షణకు సంబంధించి దరఖాస్తులకు ప్రభుత్వం గడువును పెంచినట్లు కుప్పం నియోజకవర్గ సహాయ సంక్షేమ అధికారిణి మీనాక్షి సోమవారం ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 25 లోపు జ్ఞానభూమి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రూ.6.19లక్షల అపరాధ రుసుం వసూళ్లు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని లద్దిగం చెరువులో అక్రమంగా ఇసుక తోడేస్తున్న వాహనాల నుంచి సోమవారం రూ.6,19,999 అపరాదం రుసుము వసూలు చేసినట్లు తహసీల్దారు హనుమంతు తెలిపారు. ఐదు హిటాచీ, టిప్పర్ నుంచి ఈ మొత్తం వసూళ్ల చేసినట్లు వివరించారు.

విద్యార్థినులకు ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థినులకు స్కాలర్ షిప్ పంపిణీ చేస్తున్న సైబర్ డైనమిక్స్ ప్రతినిధులు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక సైబర్ డైనమిక్స్ పరిశ్రమ ఆధ్వర్యంలో 16 మంది పేద విద్యార్థినులకు ఉపకార వేతనాల చెక్కులను సోమవారం పరిశ్రమ ప్రతినిధులు పంపిణీ చేశారు. డిగ్రీ, పీజీ చదువుతున్న పేద విద్యార్థినులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 16 మందిని ఎంపిక చేసినట్లు ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఒక్కో విద్యార్థినికి రూ.35 వేలు నుంచి రూ.50 వేలు గరిష్ఠంగా పంపిణీ చేసినట్లు చెప్పారు. వీరి విద్య పూర్తయ్యేంత వరకు ఉపకార వేతనాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు మంజుశ్రీచవాన్, పులివెల రాజా, ముఖేష్ చవాణ్, సుధాకర్, పునీత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభ చాటి విజేతలుగా నిలిచి

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీవాణి విద్యాశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఈనాడు ప్రతిభ పాటవ పోటీలో పాల్గొన్నారు. సోమవారం 8,9,10 తరగతులకు చెందిన వారికి ఇంటర్‌నెట్‌తో కలిగే లాభనష్టాలు, విద్యార్థులపై సోషన్ మీడియా ప్రభావం అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అందులో పదో తరగతికి చెందిన చైతన్యజ్యోతి ప్రథమ, 9వ తరగతికి చెందిన శరణ్య ద్వితీయ, 8వ తరగతికి చెందిన శ్రుజన తృతీయ బహుమతులు సాధించారు. కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీప్రసాద్ బహుమతులు అందించారు.





▸ పరీక్ష రాస్తున్న విద్యార్థులు ▸ బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఇంటర్నేషనల్ వర్క్ షాపులో కమిషనర్



దిల్లీలో కుప్పం పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: న్యూడిల్లీలో జరుగుతున్న అర్బన్ భూ రికార్డులపై 'మోడల్ టెక్నాలజీస్ సర్వే మరియు రీసర్వే'పై నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ వర్క్ షాపులో కుప్పం పురపాలిక కమిషనర్ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఆంధ్ర రాష్ట్రం నుంచి కుప్పంతో పాటు కాకినాడ, ఏలూరు, మంగళగిరి, గుంటూరు, ఒంగోలు, తిరుపతి, అనంతపురం పురపాలికలకు చెందిన అధికారులు హాజరైనట్లు ఆయన చెప్పారు. ఈ వర్క్‌షాప్ రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

భరతకళా ఉత్సవంలో ప్రతిభ చూపిన విద్యార్థులు



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

పలమనేరు, న్యూస్‌టుడే: తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించిన భరతకళా ఉత్సవంలో పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు తెలిపారు. వే ఫౌండేషన్ సంస్థ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం చేపట్టిన కార్యక్రమంలో తమ కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొన్నారని వివరించారు. ఇలవరసన్, మానస, శేషాద్రితో పాటు పలువురు విద్యార్థులు శివ తాండవం, భరతనాట్యం, కూచిపూడి ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శన ప్రశంసా పత్రాలు పొందినట్లు వివరించారు. విద్యార్థులకు సోమవారం కళాశాలలో ప్రసంశా పత్రాలు, బహుమతులు అందించినట్లు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా లేదు

పాఠశాలలను తనిఖీ చేసిన న్యాయమూర్తి



భోజనాలు రుచి చూస్తున్న జడ్జి లిఖిత

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ బాలుర, ఉర్దూ ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రుచికరంగా లేదని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి లిఖిత అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఆమె పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనాల తయారీని ఆమె స్వయంగా తనిఖీచేసి న్యాయవాదులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో భోజనం రుచికరంగా లేదన్నారు. ఉర్దూ ఉన్నత పాఠశాలలో గుడ్డు కుర్మా సక్రమంగా లేదన్నారు. ప్రభుత్వ మెను ప్రకారం భోజనాలు శుభ్రంగా రుచికరంగా ఉండాలని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనాలను తనిఖీ చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆమె చెప్పారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పైకప్పు దెబ్బతిందని ఆమె పేర్కొన్నారు. వంటలు చేసే సమయంలో వర్షపు నీరు అందులో పడే ప్రమాదం ఉందని వెంటనే అధికారులు పైకప్పును మరమ్మతు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీపతి, సీనియర్ న్యాయవాది ఎల్.భాస్కర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గత పాలకుల పాపాలు

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు



తహసీల్దారు భవనం లోపల ఉరుస్తున్న దృశ్యం



పెచ్చులు ఊడిన పశువైద్యశాల



మేలుమాయిలో శిథిలావస్థలో ఆరోగ్య ఉపకేంద్రం

గంగవరం, న్యూస్‌టుడే: గత పాలకులు చేసిన తప్పిదంతో మండలంలోని పలు ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఐదేళ్లలో ఎప్పుడూ ప్రభుత్వ భవనాల పరిస్థితులు గురించి పట్టించుకోలేదు. ఫలితంగా ప్రస్తుతం భవనాలు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. మండల తహశీల్దారు కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. తహశీల్దారు కార్యాలయంలో వర్షం వస్తే ఉరుస్తోంది. రికార్డులు భద్రపరిచే గది మాత్రం బాగున్నా, భవనం పూర్తిగా దెబ్బతింది. వర్షపాతం నమోదు చేసే వర్షపాతం నమోదుకు సిబ్బంది తంటాలు పడుతున్నారు. మేలుమాయి ఆరోగ్య ఉపకేంద్రం శిథిలావస్థకు చేరుకొని కూలడానికి సిద్ధంగా ఉండడంతో మూసివేశారు. పాత పంచాయతి కేంద్రంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఆ భవనం కూడ ఉరుస్తుండడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పశువైద్యశాల భవనం పెచ్చులు ఊడిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నా విధిలేని పరిస్థితిలో అక్కడే వైద్యం చేస్తున్నారు. మందులు ఉంచే గదిలో వర్షాలకు వర్షపు నీరు చేరింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామసభలు ఏర్పాటు చేసి నూతన భవనాల కోసం ప్రతిపాదనలు పంపారు. నూతన భవనాలు మంజూరైతే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రభుత్వ నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయాల్లో శిథిలావస్థకు చేరుకున్న భవనాలను మార్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కూటమి పాలనలో గ్రామాల అభివృద్ధి

బైరెడ్డిపల్లె: కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెదేపా మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం బేలుపల్లె, కమ్మనపల్లె గ్రామాల్లో సిమెంటు రోడ్లు, కాలువల నిర్మాణానికి ఆయన భూమిపూజ చేపట్టారు. **పుంగనూరు:** కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పల్లె పండుగ- ప్రగతికి అండగా ఉంటుందని మండల తెదేపా అధ్యక్షుడు మాధవరెడ్డి, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల రమణ అన్నారు. సోమవారం మండలంలోని బోడినాయునిపల్లె, నల్లగుట్లపల్లెల్లో సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. **రామకుప్పం:** మండల పరిధిలోని రామకుప్పంలో సీసీ రోడ్ల నిర్మాణానికి తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్ బాబు సోమవారం భూమి పూజ చేసారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, నాయకులు మునస్వామి, ఆంజనేయరెడ్డి, సీతాపతి పాల్గొన్నారు.

భూమి, ఆహార ఉపాధి భద్రత కల్పించాలి

కల్లూరు: మండలంలోని వ్యవసాయ కూలీలకు భూమి ఆహార ఉపాధి ప్రభుత్వ పథకాలు కల్పించాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ వృత్తిదారులు యూనియన్ జిల్లా మహిళా కార్యదర్శి బి.పార్వతి కోరారు. సోమవారం మండల వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దారు జయసింహకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, రామానుజులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.51.91 లక్షల మంజూరు

శాంతిపురం, న్యూస్‌టుడే: మండల పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వం కడ ప్రాజెక్టు ద్వారా రూ.51.91 లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీడీఓ కుమార్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి వసతికి రూ.40 లక్షలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు రూ.9.36 లక్షలు, 15 మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.2.55 లక్షలు మంజూరైనట్లు వివరించారు.

పెండింగ్ బిల్లును విడుదల చేయాలి

పుంగనూరు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన, అమ్మఒడి బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనరు ప్రవీణ్ సోమవారం డిమాండు చేశారు.



పాడి రైతులకు మందులను పంపిణీ చేసిన అధికారులు

ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన

రొంపిచెర్ల, కల్లూరు, న్యూస్‌టుడే: రొంపిచెర్ల మండలం గానుగచింత పంచాయతీ కల్లావారిపల్లెలో సోమవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 208 పాడి ఆవులకు ప్రాంతీయ పశువైద్యశాల సోమల అసిస్టెంట్ డైరెక్టరు డాక్టరు శ్రీనివాసులునాయుడు చికిత్స చేశారు. కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ డాక్టరు సుబ్బారావు, కూటమి నేతలు కృష్ణమనాయుడు, మధుసూధన్‌నాయుడు, వెంకటరమణనాయుడు పాల్గొన్నారు.

పుస్తకాలు విజ్ఞానాన్ని పెంచుతాయి



పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

పలమనేరు, న్యూస్‌టుడే: పుస్తకాలు చదవటం ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవచ్చని శతావధాని ఆముదాల మురళి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో అమృత భారతి ఫౌండేషన్ నిర్వాహకులు వివేకానందుని జీవితం-అదర్శాలు అనే పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల పుస్తకాల వలన మస్తిష్కం వికసిస్తుందన్నారు. తిరుపతి రామకృష్ణ సేవా సమితి వారు రూ.20 వేల విలువ చేసే శానిటరీ నాప్‌కిన్లను కాల్చే రెండు యంత్రాలను పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథంనాయుడు, రామకృష్ణ, అచ్యుత్, అఖిల్, పాఠశాల ప్రిన్సిపల్ ప్రశాంతి పాల్గొన్నారు.

దుర్వినియోగాన్ని అడ్డుకోవాలి



లద్ధిగం చెరువును సందర్శించి మాట్లాడుతున్న భాజపా నాయకులు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని జరుగుతున్న అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవాలని భాజపా రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ డిమాండు చేశారు. సోమవారం ఆయన మండలంలోని లద్ధిగం చెరువును సందర్శించారు. అక్రమ ఇసుక తవ్వకాలను పరిశీలించారు. రైతులకు అన్యాయం జరిగితే అడ్డుకుంటామన్నారు. రైతులకు ఆధారమైన లద్ధిగం చెరువును కొల్లగొట్టి కోట్లు దండుకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. గత ప్రభుత్వం కంటే ఎక్కువ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు నరసింహులు, బాబు, చౌడేపల్లె భాజపా అధ్యక్షుడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: నడింపల్లెలో దళిత కుటుంబంపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని మానవ హక్కుల, కులవివక్ష వ్యతిరేక సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీ మునిరత్నం అన్నారు. దాడిలో గాయపడి పలమనేరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం ప్రజాసంఘాల జేఏసీ నాయకులు పరామర్శించారు.

మా బాధల్ని తీర్చండి

క్షేత్రస్థాయిలో పరిష్కారం దక్కట్లేదు

క్షేత్రస్థాయిలో కాళ్లరిగేలా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవట్లేదు.. మా బాధల్ని వినేవారు కరవయ్యారు.. మండల స్థాయిలో పరిష్కారం దక్కకపోవడంతో మీ వద్దకు వచ్చాం.. జిల్లా ఉన్నతాధికారులు.. మా బాధల్ని ఆలకించి పరిష్కారం చూపాలని కోరారు అర్జీదారులు.

న్యూస్‌టుడే, చిత్తూరు కలెక్టరేట్


ఇల్లు కట్టేందుకు అనుమతి ఇప్పించండి..



మా కుటుంబం ఎన్నో ఏళ్లుగా మా గ్రామంలో చిన్న పూరిగుడిసెలో నివాసం ఉంటున్నాం. ఇంటిని కట్టుకోవాలని గుడిసెను తొలగించాను. గుడిసెను తొలగిస్తున్నప్పుడు అటవీ అధికారులు ఏ అభ్యంతరమూ చెప్పలేదు. ఇప్పుడు గృహం కట్టుకోవాలని ప్రయత్నిస్తుంటే అడ్డుకుంటున్నారు. మాకు నిలువ నీడలేదు. అధికారులు స్పందించి అనుమతి ఇప్పించాలని అర్థిస్తున్నా.

-పాలేటప్ప, గౌనుచెరువు ఎస్టీ కాలనీ, చౌడేపల్లె మండలం

భూమి ఆక్రమించారు..



గ్రామంలోని 130/6 సర్వేలో 98 సెంట్ల భూమి ఉంది. ఈ భూమి దురాక్రమణకు గురైంది. భూమిని సర్వేచేసి ఇవ్వాలని మండల అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. జిల్లా అధికారులు స్పందించి నా భూమిని సర్వే చేసి తిరిగి అప్పగించాలని వేడుకుంటున్నా.

-వెంకటేష్, నలగాంపల్లి గ్రామం, గుడుపల్లె మండలం

లాటరీ విక్రేత అరెస్టు

పుంగనూరు గ్రామీణ: పట్టణంలోని సెంటర్‌లాడ్జిలో తోపుడు బండిలో కూరగాయలు విక్రయిస్తున్న ఎస్.ముబారక్ సోమవారం లాటరీ టికెట్లు విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. రూ.400 విలువ లాటరీ టికెట్లు, రూ.8 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

అప్పు చెల్లించమని అడిగినందుకు దాడి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: వస్త్ర దుకాణంలో దుస్తులు కొనుగోలు చేసిన వారిని షాపు యజమాని నగదు చెల్లించమని అడిగినందుకు నలుగురు వ్యక్తులు దుకాణ యజమానిపై దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు వివరాల మేరకు. . పట్టణంలోని నాగపాళ్యంలో ఎస్.జావిద్‌బాషా వస్త్ర దుకాణం నడుపుతున్నారు. స్థానిక ఎంఎస్ఆర్ థియేటర్ సమీపంలో ఉంటున్న ఆటో డ్రైవర్ అక్రమ్ రెండు నెలల కిందట రూ.10 వేలు విలువ చేసే దుస్తులు కొనుగోలు చేసి రూ.2 వేలు చెల్లించి మిలిగిన రూ.8 వేలు వారంలో ఇస్తానని వెళ్లిపోయారు. రెండు నెలలు గడుస్తున్నా ఇవ్వకపోవడంతో జావిద్‌బాషా ఫోన్ చేసి అప్పు చెల్లించాలని అడిగారు. 'నన్నే డబ్బు కట్టమంటావా' అని కుమారులైన వసీమ్, గౌస్‌పీర్, సయ్యద్‌లతో కలిసి ఈ నెల 16న దుకాణానికి వెళ్లి జావిద్‌బాషాపై దాడి చేశారు. తలకు తీవ్రగాయం కావడంతో చికిత్స నిమిత్తం మదనపల్లెకు వెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

పుంగనూరు, న్యూస్‌టుడే: ఉద్యోగులు, కార్మికులు సమష్టిగా విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ స్థానిక సబ్‌డివిజన్ ఏవో జయచంద్ర కోరారు. సోమవారం స్థానిక ఏడీఈ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. మొదటగా ఏపీఎస్పీడీసీఎల్ డిస్కం ఎస్సీ, ఎస్టీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో సంఘ నాయకులు జయరామయ్య, సుమిత్ర రమణ, సుబ్రమణ్యం, శంకరయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం

కలకడ: బంధువు అంత్యక్రియల్లో పాల్గొని తిరిగి ఆటోలో ఇంటికొస్తుండగా వారిని ప్రైవేటు ట్రావెల్ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. కడప-చిత్తూరు జాతీయ రహదారిలోని కలకడ సమీపంలో సోమవారం రాత్రి ఆటోను ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కలకడ సమీపంలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలో జరిగింది. ప్రమాదంలో సోమల మండలం నెల్లిమందకు చెందిన ఆటో డ్రైవరు నూరుల్లా (36) మృతి చెందారు. కలకడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిరుత సంచారంపై ఆందోళన



కరణంవారిపల్లె పొలాల్లో చిరుత అడుగులు ఆనవాళ్లు

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని కాగతి పంచాయతీ కరణంవారిపల్లె పొలాల్లో చిరుత సంచారం చేసినట్లు ప్రచారం జరిగింది. గ్రామానికి చెందిన రాజమ్మ తోటలో చిరుత అడుగులు ఆనవాళ్లు గుర్తించడంతో సమీప పల్లెల్లో ప్రజలు ఆందోళన చెందారు. స్పందించిన అటవీ శాఖ అధికారులు రామయ్య, యువరాజు అడుగులను పరిశీలించారు. చిరుత అడుగులు కాదని హైనా లేదా రేసు కుక్క పర్యటించిందని ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.